కథ

# అనుబంధం

– వలివేటి నాగచంద్రావతి

"అతని పేరు రషీద్. అవును, నేనతన్ని ప్రేమిస్తున్నాను" అపర్ణ కంఠంలో ఓ మాదిరి తెగింపు.

"ఎవరే అతను?" అని అడుగుతున్నప్పుడే దాన్నించి ఆ సమాధానం వస్తుందేమోనని భయపడ్డాను. రాకూడదని ఆశించాను. కానీ ఆ జవాబే వినక తప్పలేదు.

"ప్రేమా దోమా... నోర్ముయ్. పళ్ళు రాలగొడతాను" చెయ్యెత్తాను కోపంగా. వెంటనే ఏదో ఒకటిచేసి ఆ పరిస్థితిని తప్పించేయాలనుంది నాకు.

"ష్, గొడవ చేయకు. వాణ్ణి రానీ చూద్దాం" మా మామగారు నన్ను వారించారు. వాడు అంటే మావారన్నమాట! మా ఇంట్లో వాళ్ళకి నామీదకంటే ఆయనంటేనే గురి.

నా చేతిలోని ఫొటోను విసురుగా లాక్కొని నావైపు ఎర్రగా చూస్తూ వెళ్ళిపోయిందక్కణ్ణుంచి అపర్ణ. నిట్టూర్చాను.

"ఇప్పుడు ఇంత పొడుగున నిట్టూరిస్తే ఏం లాభమమ్మాయ్. ఎవరితోనో బైకుమీద కనిపించిందట- నా స్నేహితుడు చెప్పాడు. అడుగు దాన్ని. జాగ్రత్తలు తీసుకో అని ఎప్పుడో చెప్పానా? అప్పుడు ఊరుకున్నావు. ఇప్పుడేమో...".



మామగారి సతాయింపు అవలేదు. నేను వంటింట్లోకి వచ్చేశాను. అక్కడ మాత్రం మనశ్శాంతా?

అత్తగారి సణుగుడు, 'ఆడపిల్లని కాస్త అదుపులో పెంచాలే అంటే నామాట ఎవరైనా విన్నారా? ఇప్పటిదాకా అదుపులేకుండా ఎగరనిచ్చి ఇప్పుడాగమంటే ఆగుతుందా? పుస్తకాల్లో అబ్బాయిల ఫొటోలు పెట్టుకునేదాకా వచ్చేసింది. ఇంకా అడిగితే నా ఇష్టమని కూడా అనేస్తుంది. చేతులారా చేసుకున్నదే, అనుభవించండీ!"

ఆవిడంతే. తను గారాబంచేస్తే 'మన పిల్లల్ని మనం ముద్దుచేయకపోతే ఇంకెవరు చేస్తారు' అంటుంది. మేం చేస్తే, 'అదిగో అందుకే చెడిపోతున్నారు' అంటుంది. సరే, నేనెదురుగా ఉంటే ఆవిడ నోటికి అస్సలు తాళం పడదు. నేనక్కణ్ణుంచి వచ్చేస్తోంటే స్వరం తగ్గించి ఆవిడ గొణుక్కోవడం వినిపించింది. "ఆడపిల్లల ముచ్చట్లకీ ఇల్లు అచ్చి రాదేమో. ఒక బిడ్డ ఈ ఇంటికి ఎప్పుడో దూరమయిపోయింది. ఈ పిల్ల ఈ వంకన గడప దాటుతుంది కాబోలు భగవంతుడా" అని.

బైకు శబ్దమైంది- ఆయన వచ్చినట్టు. నేను వాకిట్లోకి పరిగెత్తాను. బ్రీఫ్‌కేసు అందుకుని మెల్లగా ఏదో అడుగుతున్నట్లుగా ఆయన్ని గదిలోకి తీసుకువచ్చేశాను. అందరూ వచ్చారంటే ఒకటే గందరగోళం. అసలు విషయానికి ఎన్నో తోకలు.

"ఏమయింది?" అడిగారు. ఏదో అయిందని పసిగట్టేశారన్నమాట.

చెప్పాను. "అపర్ణ అప్పుడప్పుడూ ఇంగ్లిషు నవల్సేవో తెచ్చుకుంటుంటుంది రెంటుకి. సాయంత్రం తోచక దాని షెల్ఫ్‌లో పుస్తకం తెచ్చుకున్నారట మామయ్య. దాన్లో ఉంది ఓ ఫొటో. తెచ్చి నాకిచ్చారు. అడిగితే బెదురుతుందనుకున్నారు. ఉహూ- ఏదో ముస్లిం పేరు చెప్పింది. ప్రేమిస్తోందట".

చెప్పడం పూర్తయింది. బిలబిల్లాడుతూ వచ్చేశారంతా- అపర్ణ తప్ప. "ఒరే శివుడూ - వచ్చావా- మరేమయిందంటే..." మా అత్తగారు చెప్పబోయారు.

"ఇప్పుడేం మాట్లాడొద్దు. రేపు నాకు ఆఫ్. ఏమున్నాసరే రేపే మాట్లాడుకుందాం. టవలు భుజాన వేసుకుని బాత్‌రూమ్‌కి వెళ్ళిపోయారాయన. ఏ వ్యవహార పరిష్కారానికైనా ప్రథమావేశాలు చల్లబడాలంటారాయన.

ఆ రాత్రి అపర్ణ తన గది వదిలి రాలేదు. భోజనమూ చేయలేదు. దాన్ని బతిమలాడీ బతిమలాడీ భంగపడి గ్లాసుతో పాలు వెచ్చబెట్టి తీసుకువెళ్ళాను.

"ఫస్ట్ పార్ట్, గ్రాండ్ సక్సెస్. ఫొటో తాతయ్య కళ్ళబడింది. అందరికీ ఉప్పందిపోయింది" సెల్‌లో ఎవరికో చెబుతోందల్లా నన్ను చూసి ఆపేసింది.

'ప్లాను ప్రకారమే జరిపిస్తోందన్నమాట. ఎన్ని తెలివితేటలూ...' పాలగ్లాసు అందించి వచ్చేశాను.

★ ★ ★

తెల్లారింది. మధ్యాహ్నమైంది. ఇంటిసభ్యులమందరం హాల్లో అత్యవసర సమావేశమయ్యాం. వీధి తలుపు గట్టిగా బిగించాను. అపర్ణని కూడా బలవంతాన హాల్లోకి లాక్కొచ్చి కూర్చోబెట్టాను.

"ఊ, ఇప్పుడు చెప్పు" అడిగారు మావారు. వంచిన తల పైకెత్తలేదు అపర్ణ.

వదుల్తామా- ఎవరతను, ఎలా పరిచయం, ఎన్నాళ్ళ పరిచయం, ఏం చదివాడు, ఉద్యోగమేమిటి, శాలరీ ఎంత, అతని కుటుంబ నేపథ్యమేమిటి? ప్రశ్నల పరంపర- ఒక్కొక్కళ్ళం ఒక్కొక్కటిగా.

అపర్ణ తలదించుకునే జవాబులు చెప్పింది. పేరు రషీద్. మూడు నెలలుగా పరిచయం. తను కాలేజీకి వెళ్ళే బస్‌లోనే అతను తన కంపెనీకి వెడతాడు.

"చిన్న ఉద్యోగమే అనుకుంటాను. మిగతావేవీ నాకు తెలియవు. నేనడగలేదు. అయినా బయోడేటా తెలుసుకుని మరీ ప్రేమిస్తారా?" అపర్ణ ఉక్రోషపడింది.

తీక్షణంగా అపర్ణవైపు చూస్తూ అడిగారు మా మామగారు. "సరే, అతని ఫ్యామిలీ మీ పెళ్ళికి ఒప్పుకున్నదటనా?"

"ఉహూ" నీరసంగా అన్నది అపర్ణ.

"మేమూ అంగీకరించం" కఠినంగా అన్నారు మామయ్య. ఆ వెంటనే లేచి నుంచుని మావారిని ఉద్దేశించి, "చూడు శివా, ఏమి చెబుతావో ఏమిటో, ఆ వెధవ్వేషాలు మాత్రం సాగవని కచ్చితంగా చెప్పంతే" అంటూ యస్వీరంగారావులా మొహం బిగించి బయటకు వెళ్ళిపోయారు.

మావారు లేచి సోఫాలో అపర్ణ పక్కకొచ్చి కూర్చున్నారు. "చూడు తల్లీ, ఏ భవిష్యత్ నిర్ణయానికైనా ఎంతో ముందుచూపు ఉండాలి. నువ్వింకా చిన్నపిల్లవి. ఎన్నో అనుభవాలతో తలలు పండించుకున్నవాళ్ళం. నీ మేలు కోరేవాళ్ళం. మేం చెప్పేది విను" అన్నారు ఎంతో సౌమ్యంగా.

అపర్ణ 'ఊ' అనలేదు, 'ఉహూ' అనలేదు. మౌనం అర్ధాంగీకారంగా భావించి చెప్పాలనుకున్నవన్నీ చెప్పేశాం.

పెద్దలకు ఇష్టంలేకుండా చేసుకునే సాంప్రదాయబద్ధంకాని పెళ్ళిళ్ళవల్ల కలిగే కష్టాలూ నష్టాలూ ఎదురుదెబ్బలూ అన్నీ చెప్పేసి ఊపిరి పీల్చుకున్నాం.

అపర్ణ కన్విన్స్ అయిందో లేదో చెప్పలేను. మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయింది.

సమావేశం ముగిసింది.

ఓ గంట గడిచిందేమో, ఎవరి గదుల్లో వాళ్ళు విశ్రాంతి తీసుకుంటున్నారు. నేను వంటింట్లో గిన్నెలు సర్దుకుంటున్నాను. అప్పుడు వినిపించింది- అపర్ణ గదిలోనుంచి సన్నగా రింగ్‌టోన్ మ్యూజిక్. కామ్‌గా కిటికీ పక్కన నుంచున్నాను.

"ఏం జరిగిందా? వాష్... బ్రెయిన్‌వాష్. బుర్రెంత శుభ్రపడిందంటే ఏడుజన్మల వరకూ వాళ్ళు చెప్పినవాణ్ణే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయానికొచ్చేశాను".

"ఏమిటీ, ఈ జన్మకి మాత్రం నిన్ను చేసుకోవాలా - అబ్బ ఆశ. నో యూజ్. ఈ జన్మలో కూడా వాళ్ళు తెచ్చిన పెళ్ళికొడుకునే వరిస్తున్నాను" అపర్ణ నవ్వుకుంటూ సెల్ ఆఫ్ చేసింది. నేనివతలకి వచ్చేశాను.

'మా దగ్గరేమో నంగనాచిలా బుర్ర వంచుకుని నటించేస్తోంది. అతనికేమో ఎప్పటి సమాచారమప్పుడు అందించేస్తోంది. దీని

పథకమేమిటి చెప్మా. చివరికి ఏం కొంప ముంచుతుందో ఏమిటో'. ఈ ముక్క ఆయన చెవిన వేసేవరకూ నా మతి మతిలో లేదు.

"దాన్ని కొన్నాళ్ళు కాలేజీకి పంపకు" అన్నారాయన సీరియస్‌గా.

"ఫైనలియరు..."

"ఫరవాలేదు. ఈ ఏడు కాకపోతే వచ్చే టర్మ్‌లో రాస్తుంది. బయటకు కూడా పంపకు. ఇంట్లో ఓ కన్ను దానిమీద వేసి ఉంచు" జాగ్రత్తలు చెప్పారు. అంతే. మా ఇంట్లో మేమే గూఢచారులమయిపోయాం.

★ ★ ★

"రెండు కప్పులు కాఫీ పట్రా అమ్మాయ్. అలాగే శివుణ్ణి పిలు" వీధి వరండా మెట్లెక్కుతూ కేకేశారు మామయ్య.

నేను కాఫీ కప్పులు తీసుకువెళ్ళాను. ఆపాటికే మావారొచ్చి కూర్చున్నారక్కడ. ఇద్దరూ టీపాయ్ మీదున్న కాగితాలేవో చూస్తున్నారు.

నాన్న మ్యారేజీ బ్యూరో నుంచి అబ్బాయిల బయోడేటాలు తెచ్చారు అపర్ణ కోసం. నా ప్రశ్నార్థక ముఖంచూసి చెప్పారు మావారు.

అవాక్కయ్యాను. "అపర్ణ ఒప్పుకుంటుందంటారా?" ఆ తర్వాత అన్నాను భయభయంగా.

"ఒప్పించాలమ్మా. ఈ ప్రేమలూ అవీ తాత్కాలిక వ్యామోహం. ఎట్లాగో 'ఊ' అనిపించి ఆ నాలుగక్షింతలూ వేయించామా...
ఆ తర్వాత అదే ఎడ్జస్టయిపోతుంది" అన్నారు మామయ్య తేలిగ్గా.

"మీరు చెప్పినంత సులువు కాదులెండి అది. పోనీ కొంచెం టైమిస్తే ఏం?" మాకు కూడా కప్పులతో కాఫీ తెస్తూ అన్నారు అత్తయ్యగారు.

"వద్దమ్మా. ఆలస్యం చేసేకొద్దీ దాని బుద్ధి ఎలా మారుతుందో. అతన్నే చేసుకుంటానని మొండికేస్తుందేమో. అరె. అంత పిచ్చిలో ఎలా పడిందో అర్థంకాదు. కులం, మతం మాట వదిలేయండి. టెన్త్ ఫెయిలయి అటెండరుగా చేస్తున్నాట్టెక్కడో. కనుక్కున్నాను. పిల్లలు తెలీక గోతిలో దూకుతామంటే చూస్తూ ఊరుకోగలమా? నాన్న చెప్పినట్టు వెంటనే దానికి పెళ్ళి చేసేయటమే ఈ సమస్యకి విరుగుడు" తేల్చేశారు మావారు.

ఆ తర్వాత మేము బయోడేటాలు చూసే పనిలోపడ్డాం. అత్తగారు కప్పులు పట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయారు. మామయ్య ఒక్కొక్క పేపరూ తీసి తనుచూసి మావారికి అందిస్తున్నారు. ఆయన చూసి నాకు ఇస్తున్నారు.

ఉన్నట్టుండి నిటారుగా అయ్యారు మామయ్య- ఓ బయోడేటా చూస్తూ. ఆయనలోని కంగారుని పట్టిచ్చిన మరో పనేమిటంటే దాన్ని మావారికి ఇవ్వకుండానే పక్కకి పెట్టేయడం.

'అదేం మామయ్యా' అని నేనడిగేలోపల మావారే దాన్ని చేతిలోకి తీసుకుని చూశారు.

చూసీ చూడగానే "అరె. ఇది మన మంజుల కొడుకు బయోడేటా నాన్నా" అన్నారు సంభ్రమంగా.

మంజుల అంటే ఆయనగారి చెల్లెలు, నాకు ఆడబిడ్డ.



"మన ఏమిటి మన..." విసుక్కున్నారు మామయ్య.

"ఏదీ ఇటివ్వండి చూస్తాను" ఆయన చేతిలో పేపరు లాక్కున్నట్టుగా తీసుకుని చూశాను. అబ్బాయి చాలా బావున్నాడు. ఆటోమొబైల్ ఇంజినీరుట. ఏదో కంపెనీలో మంచి పొజిషన్‌లో ఉన్నాడు.

"అవునూ, వాళ్ళు ఇండియా ఎప్పుడొచ్చారు? ఫారిన్‌లో ఉన్నారన్నారుగా" అడిగాను కుతూహలంగా.

"రెండేళ్ళయింది. వాళ్ళ మామగారి కోరిక మీద అక్కడి ఉద్యోగం వదులుకుని వచ్చేశారట. బైకులకు సంబంధించిన స్పేరు పార్టులేవో తయారుచేయాలనే సన్నాహంలో ఉన్నారని విన్నాను" ముభావంగానే సమాచారాన్ని క్లుప్తంగా అందించారు మావారు.

మామయ్య వంక చూశాను. తెలీని విషయం వింటున్నట్టుగా లేదు వాలకం.

"సర్లె. అది పక్కనపెట్టి మిగతావి చూడు" అన్నారు మామయ్య పొడిగించటం ఇష్టంలేనట్టుగా.

'రాజును చూసిన కళ్ళతో...' అన్నట్టుగా మిగతావేవీ నాకస్సలు నచ్చలేదు. ఆ అబ్బాయికే అడిగితే తప్పేంటి? అమ్మో, మామయ్య చెంప ఇంకా బిగుసుకునే ఉంది. తర్వాత చూద్దాం.

మధ్యాహ్నం ఆ బయోడేటా తీసుకెళ్ళి అత్తగారికి రహస్యంగా చూపించాను.

"దొరబాబులా ఉన్నాడే నా మనవడు" అని ఫొటో తడుముతూ తెగ మురిసిపోయారు మా అత్తగారు. "ఈ ఇంట్లో పుట్టాల్సినవాడు, ఈ ఇంటికి అల్లుడై రావల్సినవాడు... వాడి ఫొటో కూడా దొంగచాటుగా చూడాల్సివస్తోంది" అని వాపోయారు. "పాపిష్టి వాళ్ళమ్మా వాడి తాతా, బామ్మా - శివుడికి వాళ్ళమ్మాయిని చేసుకొమ్మని అడిగితే కుండమార్పిడి ఇష్టంలేక వద్దన్నాం. అదీ కక్ష. మా బిడ్డని మా గడప తొక్కనీకుండా చేశారు పంతంకొద్దీ. దానికితోడు ఆ అమ్మాయికి పెళ్ళిచేస్తే ఏడాది తిరక్కుండానే విధవరాలయి పుట్టింటికి తిరిగొచ్చింది. దురదృష్టం అనుకోక 'మీరు చేసుకునుంటే మా పిల్లకీరాతవచ్చుండేది కాదుగదా' అని మామీద ఇంకా కోపం పెంచేసుకున్నారు. శత్రువులకింద జమకట్టేశారు మమ్మల్ని.

చివరికి అమ్మాయీ అల్లుడూ అమెరికా వెళ్ళిపోతుంటే ఆత్రంగా వెళ్ళాం చూడ్డానికి. నానామాటలూ అన్నారు మమ్మల్ని. అల్లుడు మాట్లాడలేదు. 'వెళ్ళిపోండి నాన్నా' అంది అమ్మాయి. అప్పట్నించే మీ మామగారి మనసు విరిగిపోయింది. వాళ్ళ పేరు ఎత్తరు, ఎత్తనివ్వరు. రహస్యంగా అన్నా మాట్లాడి బెంగ తీర్చుకునేందుకు ఆ రోజుల్లో ఫోన్లు లేవు. ఇప్పుడు నంబర్లు తెలియవు. ఏడాదికో రెండేళ్ళకో వాళ్ళకీ మాకూ బంధువులైనవాళ్ళో స్నేహితులయినవాళ్ళో తటస్థపడి చెబితేనే వాళ్ళ సమాచారం నాకు తెలిసేది".

పాత పురాణమంతా మళ్ళీ ఓసారి నాకు రికార్డువేసి వినిపించారు మా అత్తగారు.

పాపం ఆవిడ బాధ ఆవిడది. సానుభూతిగా వింటే అదో తృప్తి.

నా గోల నాది. 'రాత్రికి మనవాళ్ళముందుంచబోయే నా ప్రతిపాదనకి మీరు వత్తాసివ్వండి భయపడకుండా' అని కోరాను. సరేనన్నారావిడ.

రాత్రి-

మామయ్యకీ మావారికీ పుల్కాలు, కూర ఉన్న పళ్ళాలు టేబుల్‌మీద పెట్టి "మంజుల వదిన కొడుకు బావున్నాడు కదండీ" అన్నాను సంభాషణకు నాందిగా. ఎవరూ మాట్లాడలేదు.

"మంచి పొజిషన్‌లో కూడా ఉన్నాడు. మన అపర్ణని ఇస్తేనేం మామయ్యా" అన్నాను సూటిగా రంగంలోకి దిగిపోయి.

"నీకేం మతిపోయిందా. వాళ్ళెంత కర్కోటకులో మీ అత్తగారు చెప్పలేదూ" అన్నారు గట్టిగా.

నేను ఊరుకోలేదు. "అంత కర్కోటకులైతే ఇన్నేళ్ళు వదిన వాళ్ళమధ్య ఎలా ఉండగలిగింది మామయ్యా" అన్నాను. ఆయన మాట్లాడలేదు. "ఒక్కో సందర్భం ఎంత మంచి మనిషినైనా విచక్షణ మరచి ప్రవర్తించేలా చేస్తుంది. అతి సహజమైన మానవ బలహీనత అది. వదిలెయ్యండి మామయ్యా. జరిగినవేవీ మళ్ళీ తవ్వుకోవద్దు. ఇప్పుడు అవసరం మనది. అడిగి చూడ్డంలో తప్పేముంది?" అన్నాను ప్రాధేయపూర్వకంగా సమాధానపరుస్తూ.

"తొందరేం, చూద్దాంలే" అన్నారు మామయ్య దాటవేసే ప్రయత్నం చేస్తూ.

"మీనం, మేషం లెక్కేట్టుకుంటూ కూర్చుంటే ఆనక పురోహితుడివ్వాల్సిన అక్షింతలు మీ మనవరాలే మన చేతికిచ్చి దీవించమనేట్టుంది" విసుగ్గా అన్నారు మావారు.

"శివా..."

"అవున్నాన్నా. అపర్ణ చూశారా ఎంత కామ్‌గా ఉంటోందో. దాని బిహేవియర్ నాక్కాస్త అనుమానంగా ఉండి సాయంత్రం అది స్నానానికి వెళ్ళినప్పుడు సెల్ తీసి చూశాను. ఆ ఎస్సెమ్మెస్‌లు చదివితే మతిపోయింది. 'నువ్వేం భయపడకు నేనున్నా' అని ఒకటి, 'అన్నీ సిద్ధం చేసేస్తున్నాము, వర్రీకాకు' అని ఒకటి... ఇలాంటి అర్థాలిచ్చేవే అన్నీను".

"హ్మ, ఆ కాలేజీ చూస్తే ఇంకో ఊరు వెళ్ళినంత దూరం. అవసరానికి పనికొస్తుందని ఆ సెల్

కొనిస్తే..." నుదురు కొట్టుకుంది మా అత్తగారు.

"దీన్ని ఎన్నాళ్ళని కట్టడిచేసి కాపలా కాయగలం? వాడూ ఇదీ కలిసి ఏ సాహసానికి దిగుతారోనని క్షణక్షణం టెన్షన్. ఏదేమయినా, ఈ సమస్యకి పరిష్కారం పెళ్ళి అనుకున్నాం. కానీ అర్జంటుగా అయ్యేపనా అది? దిక్కుతోచట్లేదు నాకు. దరి జేరుస్తుందో లేదో తెలీదుగానీ కనిపించిన ఒకే ఒక్క దిక్కునీ నువ్వొద్దంటున్నావ్" దిగులుగానే కాదు నింద మోపుతున్నట్టుగా అన్నారాయన.

కాసేపు అందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం- నిజంగానే దిక్కుతోచనట్టుగా.

"మనమిప్పుడు పిల్లనిస్తామని వెళ్తే మాత్రం వాళ్ళు ఆదరించి ఆహ్వానిస్తారంటారా?" నెమ్మదిగా తన రాజీ విషయాన్ని బయట పెట్టారు మామయ్య.

నాకు ఊపిరొచ్చింది. "పాతికేళ్ళనాటి మాట పట్టింపు. అది లేవనెత్తిన ముసలివాళ్ళిద్దరూ ఈ లోకంలో లేరు. విదేశాలు తిరిగొచ్చినవాళ్ళు వీళ్ళు. ఇంకా మూర్ఖంగానే ఉంటారంటారా, చూద్దాం" అన్నాను.

"ముందు మీరు వెళ్ళిరండి" క్యాలండరులో మంచి రోజు వెతుకుతూ అన్నారు మా మామగారు.

★ ★ ★

డోలాయమానం అంటారే అట్లా ఊగులాడే మనసుతోనే వెళ్ళాం. మేము అనవసరంగా సందేహపడ్డాం అని వాళ్ళ ఇంటి తలుపులు తెరుచుకోగానే అర్థమైపోయింది నాకు. వాళ్ళన్నగారిని చూస్తూనే మంజుల క్షణం కదలిక లేనట్టుండిపోయి మరుక్షణం ఆయన్ని చుట్టేసుకుని బావురుమంది. లోపల్నించొచ్చిన మంజుల భర్త దివాకర్రావుగారూ నేనూ వాళ్ళకేసి ఆర్ద్రంగా చూస్తూ ఉండిపోయాం.

"సరె సరె, ఈ సీనుకు ఇక్కడ కామా పెట్టి లోపలికొచ్చి కంటిన్యూ చేయండి. రండి బావగారూ" అన్నారాయన మొహాన చిలిపి చిరునవ్వు మెరుస్తూండగా. తెప్పరిల్లి నవ్వుకున్నాం.

మా ఇద్దర్నీ సాదరంగా లోపలికి ఆహ్వానించారు దంపతులు.

"పొద్దున్న ఫోన్లో 'అమ్మాయి బయోడేటా ఇవ్వటానికి వస్తున్నాం' అని చెప్పిందే కానీ, వదిన మీ పేరు చెప్పనేలేదన్నయ్యా. మీరని చెబితే వద్దంటామనుకున్నారా?" అభిమానంగా అంది మంజుల.

ఇక అక్కడ మేమున్న సమయమంతా ఆహ్లాదంగా గడిచిపోయింది.

గతకాలపు స్మృతుల్ని ఎవరికీ నొప్పి కలిగించని విధంగా స్పృశించి వదిలేశాం. ఇప్పటికైనా పొరపాటు సవరించుకుంటున్నందుకు ఆనందపడ్డాం.

"చల్లకొచ్చి ముంత దాచిపెడతావేం వదినా?" అంటూ చొరవగా నా హ్యాండ్బ్యాగులోంచి అపర్ణ ఫొటో తనే తీసి చూసింది మంజుల. భర్తకి చూపించింది. లోపలున్న కొడుకు చైతన్యనీ పిలిచి చూపించింది.

సువర్ణ శలాక, వెన్నెలకొమ్మ... అపర్ణ నచ్చకుండా ఉంటుందా ఎవరికైనా? ప్రసన్నంగా విచ్చుకున్న వాళ్ళ మొహాలు చూస్తేనే తెలిసిపోయింది నాకు.

చైతన్య అపర్ణ వివరాలడిగాడు. "అన్నిటికంటే మనమిలా కలుసుకోవటం, కలిసిపోవటం నాకు చాలా సంతృప్తినిస్తోంది ఆంటీ. అమ్మకిష్టమైతే నాకభ్యంతరంలేదు" అన్నాడు.

ఆ బుద్ధిమంతనం, నాన్చకుండా సూటిగా చెప్పడం నాకు చాలా నచ్చింది. మా ఇంటికి రమ్మని మరీమరీ ఆహ్వానించి వచ్చేశాం.

మర్నాడే వచ్చారు మా ఆహ్వానం మన్నించి- మంజుల, దివాకర్, చైతన్య మా ఇంటికి. మా అత్తగారూ మామగారూ బహుత్ ఖుష్. మంజుల అపర్ణకి పట్టుచీర, బంగారుగొలుసు బొట్టుపెట్టి ఇచ్చి, "ఇదే నిశ్చయ తాంబూలం. అమ్మా నాన్నగారూ ముహూర్తాలు పెట్టించేయండి" అంది.

★ ★ ★

వారంలో ముహూర్తం. ఉత్సాహంకంటే అలజడి ఎక్కువగా ఉంటోంది మాకు. అపర్ణ ప్రవర్తనే ఒక పజిల్. చైతన్యని కళ్ళెత్తి కూడా



చూడలేదది. నాకు తెలుసు. పెళ్ళి వద్దనీ చెప్పట్లేదు. మళ్ళీ అంటే మూతి ముడుచుకునే ఉంటోంది.

సెల్ తీసేసుకున్నాం. అందుకు బాధపడినట్టు కూడా అనిపించట్లేదు. తుపాను ముందు సముద్రమా అని భయం నాకు. చురుగ్గా పెళ్ళిపనులు చేసుకుంటూనే ఏమొచ్చి మీదపడుతుందో అన్నట్టు వెనక్కితిరిగి చూసుకుంటున్నాం మాటిమాటికి.

పెళ్ళిరోజొచ్చేసింది. కల్యాణమంటపానికి వెళ్ళిపోయాం. అపర్ణని గౌరీపూజకి కూడా కూర్చోబెట్టాం. దాని స్నేహితురాళ్ళందరూ బిలబిల్లాడుతూ వచ్చారు. వాళ్ళు దీనికేమైనా సందేశం మోసుకురాలేదుగదా అని అనుమానం.

ఓపక్క వాళ్ళని గమనించుకుంటూ, కామ్గా ఉన్నట్టే ఉండి ఏ అఘాయిత్యానికన్నా ఒడిగట్టదుగదా అని అపర్ణని కాచుకుంటూ, వచ్చేవాళ్ళకీ వచ్చినవాళ్ళకీ మర్యాదలు చూసుకుంటూ అష్టావధానం చేస్తున్నాం నేనూ మా అత్తగారూ.

ముహూర్తం దగ్గరపడింది. కన్యాదాతలుగా అపర్ణ పక్కన పీటలమీద కూర్చున్నాం నేనూ మావారూ. పురోహితుడు చెప్పిందల్లా చేస్తున్నానుగానీ మనసు అటు లేదు. చుట్టూ చూసుకోవటమే సరిపోతోంది.

మంత్రోచ్చారణ జోరు. మంగళ వాయిద్యా హోరుల మధ్య జీలకర్ర బెల్లం పెట్టడమైంది. వధూవరుల నడుమ తెర తొలిగింది.

శుభ దృష్టి. క్షణంలో ఏదో జరిగిందనిపించింది నాకు. జీలకర్ర బెల్లంతో అపర్ణ తలమీదుంచిన చైతన్య చేయి తీశాడు. అపర్ణకేసి కన్ను గీటాడు. గెలిచినట్టుగా బొటనవేలెత్తి చూపించాడు. యథాలాపంగా అపర్ణ వంక చూశాను. నాలుక కొద్దిగా బయటపెట్టి వెక్కిరించి చిన్నగా నవ్వుతోంది.

కలా... నిజమా? రెప్పలు మూసి తెరిచాను.

ఇద్దరూ మామూలుగానే ఉన్నారు. అపర్ణ తల దించుకునే ఉంది. చైతన్య సెల్ రింగవుతోంటే ఎత్తబోతున్నాడు.

"అయ్యా, సెల్లాపు చెయ్యండీ. పావుగంటలో మిమ్మల్ని విశ్రాంతికి వదులుతానూ" మంత్రాలతో కలిపి రాగయుక్తంగా చైతన్యని వారిస్తున్నాడు పురోహితుడు.

సూత్రధారణ అయింది. అమ్మయ్య, సరిగ్గా తాళి కట్టేటప్పుడు 'ఆగండి' అని అరుస్తూ ఎవరూ రాలేదు. తలంబ్రాలు కూడా అయినాయి. పురోహితుడు చెప్పినట్టు మిగతా తతంగాలకు కాస్త విరామం దొరికింది.

చైతన్య లేచివెళ్ళి ఫ్రెండ్స్తో మాట్లాడుతున్నాడు. నేను మెల్లగా పక్కకి వెళ్ళాను. ఇంతసేపూ నా ఆత్రానికి పట్టపగ్గాల్లేవు. నా హ్యాండ్ బ్యాగులో అపర్ణ సెల్లుంది. చకచకా మెమొరీలో వెతికాను. ఎక్కువ ఇన్కమింగ్ కాల్సున్న నంబరు దొరికింది. గబగబా నొక్కాను.

నా అంచనా కరెక్టే. అక్కడ చైతన్య సెల్ ఎత్తడం కనిపిస్తోంది. నేను మౌనంగా ఉన్నాను.

"హలో ఆంటీ, నమస్తే. నన్ను క్షమించండి. మీ అనుమానం నిజమే. ఈ నాటకమాడింది మేమిద్దరమే. ఊహ తెలిసిన దగ్గర్నుంచీ మీరు దూరమైనందుకు అమ్మ పడుతోన్న వేదన చూస్తూనే ఉన్నాను. మన రెండు కుటుంబాల వాళ్ళకీ మనసుల్లో కలిసిపోవాలనే కోరిక ఉంది. కానీ మధ్యలో చిన్న అహం అడ్డు. నేనే చొరవ తీసుకున్నాను. ఎవరి అహమూ దెబ్బతినకుండా కలపాలనుకున్నాను. మనసుంటే మార్గముంటుంది. కాలేజీకి వెళ్ళి అపర్ణని చూశాను. ఎంతో నచ్చింది. అప్పుడప్పుడూ కలిసేవాళ్ళం. నా సజెషన్కి సరేనంది. పథకం నాది. రక్తి కట్టించింది అపర్ణ".

"అమ్మ దొంగల్లారా! మమ్మల్ని పిచ్చివాళ్ళని చేశారన్నమాట" లోపల అనుకోబోయి పైకి అనేశాను.

"నన్ను కాదు" పక్కనుంచి వినిపించింది.

"ఈ నాటకంలో ప్రతి అంకమూ సజావుగా ముందుకు నడిచేందుకు దోహదపడింది నేనే..." అటు చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచాను. ఆయన... మామయ్య!

★